

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



నగరంపాలెం ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

చీరలు పంపిణీ



పట్నంబజార్: రంజాన్ పండుగ సందర్భంగా మాయాబజార్‌లో నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, గులామ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

5 శాతం రాయితీకి ఇక 7రోజులే..!

- ఈ నెల 30లోగా ఆస్తి పన్ను ఏకమొత్తంగా చెల్లిస్తే రాయితీ
- ఇప్పటివరకు 34,167 అసెస్‌మెంట్ల నుంచి రూ.24 కోట్లు వసూలు
- ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: నగరాభివృద్ధికి పన్నులే కీలకం ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించడం నగరాభివృద్ధికి దోహదపడుతుంది. గత ఆర్థిక సంవత్సరానికి పన్నులపై ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులపై వడ్డీ మాఫీ చేయడం ద్వారా ప్రజలకు భారీ ఊరట లభించింది. ప్రస్తుతం ఈ ఆర్థిక సంవత్సరానికి ఈ నెలఖారులోగా ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నుల చెల్లింపులపై 5 శాతం రాయితీ ప్రకటించింది. దీని వలన కూడా ప్రజలకు మరింత మేలు చేకూరే అవకాశం. 5 శాతం రాయితీపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక కార్యచరణతో ప్రజలకు తగిన అవగహన కల్పిస్తూ పన్నులు వసూలు చేస్తున్నారు.

నగరంలో 1,91,783 అసెస్‌మెంట్లు..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,91,783 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి రూ.138.56 కోట్లు డిమాండ్ కాగా ప్రభుత్వం పన్నులపై రాయితీ ప్రకటించిన నాటి నుంచి(ఏప్రిల్ 6 నుంచి 22వ తేది వరకు) ఇప్పటి వరకు 24 కోట్లు వసూలైంది. ఈ నెలఖారుకు రూ.50 కోట్లు వసూలు చేసేందుకు గాను రెవెన్యూ అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.

పన్ను వసూళ్లలో ముందంజ..

గత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఆస్తి పన్నులపై రాయితీ ప్రకటించడంతో మార్చి 30వ తేదీ నాటికి పన్నుల చెల్లింపుల్లో రికార్డు స్థాయిలో రూ.146 కోట్ల డిమాండ్‌కు గాను రూ.114 కోట్లు వసూలు చేసింది. మార్చి 30వ తేదీ ఒక్కరోజే 10.03 కోట్లు వసూలు చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరానికి 5 శాతం రాయితీ ప్రకటించిన ఈ నెల 8వ తేదీన ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ.1.02 కోట్లతో తిరిగి రెండోస్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచింది.

ప్రత్యేక క్యాష్ కౌంటర్లు..

ప్రజలు పన్నులు చెల్లించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్‌గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో పన్నులు చెల్లించే ఏర్పాటు చేశారు. అదే విధంగా ప్రజల సౌకర్యార్థం భారత్‌పేట 140వ వార్డు సచివాలయం, వసంత రాయపురం 148వ వార్డు సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106వ వార్డు సచివాలయంలో కూడా పన్నులు చెల్లించేందుకు వెసులు బాటు కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ మొత్తం ఆన్‌లైన్‌లో పొందుపరిచిన నేపథ్యంలో ప్రజలు డిమాండ్ నోటీసు కోసం వేచి చూడకుండా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్‌గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్కుల వద్ద పన్ను చెల్లింపు వివరాలు తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పించారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..



2023–24 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్నును ఏకమొత్తంగా ఈ నెలఖారులోగా చెల్లించిన వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పించింది. పన్నులు చెల్లించేందుకు వారం రోజులు మాత్రమే గడువు ఉంది. సెలవు దినాల్లో కూడా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పనిచేనున్న నేపథ్యంలో పన్నుదారులు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులను చెల్లించి 5 రాయితీ పొందాలి. ప్రజలు డిమాండ్ నోటీసు కోసం వేచి ఉండకుండా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్కుల వద్ద సమాచారం తెలుసుకుని పన్నులు చెల్లించవచ్చు.

– కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

ఆధ్యాత్మికతతో పరిపూర్ణ ఆనందం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



వీరాంజనేయ స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కార్పొరేటర్ ఆచారి

గుంటూరు వెస్ట్: సంపూర్ణమైన ఆనందం, మనశ్శాంతి ఆధ్యాత్మికతతోనే లభిస్తాయని శాసన మండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. పరుశరామ జయంతి, అక్షయ తృతీయ వేడుకలను పురస్కరించుకుని శనివారం స్థానిక బ్రాడీపేటలోని బడబానల ప్రతాప వీరాంజనేయ స్వామి దేవాలయంలో లక్ష తమలపాకుల దళార్చన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ కొంత సమయం దైవారాధనకు కేటాయించాలన్నారు. ఆధ్యాత్మిక నిండిన మనస్సు చెడు ఆలోచనలకు తావివ్వదన్నారు. ఆలయ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, అయితి సతీష్, పీవీ భావన్నారాయణ, అర్చకులు కె.సాయి, అంబా శంకర శాస్త్రి, పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సంరక్షణతోనే మానవ మనుగడ

ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవ సభ



ప్రపంచ ధరిత్రీ దినోత్సవ సభలో వీఆర్ జ్యోత్స్న కుమారి, సంతోషకుమారి, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవ వైవిధ్య సంరక్షణతోనే భూమిపై మానవ మనుగడ సాధ్యమని బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సంతోషకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా యువజన సర్వీసులశాఖ – స్టెప్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంతోష కుమారి మాట్లాడుతూ యువతరం ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రణను పాటించడం ద్వారా భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలని సూచించారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ పారిశ్రామిక విప్లవం అనంతరం పర్యావరణ పరిరక్షణ తద్వారా భూమిని, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడం పెను సవాలుగా మారిందన్నారు. ఈసందర్భంగా ప్రపంచ ధరిత్రీ దినోత్సవ ఉద్దేశాన్ని కళాజాతర ద్వారా కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ బి.రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, స్టెప్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, కేఎస్ఎస్సార్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఏజీఎం అంజయ్య, డీన్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా 3వ తరగతి నుంచి 10 వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్స్ విద్యార్థులు విజయకేతనం ఎగుర వేసినట్లు సంస్థ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య తెలిపారు. నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో అంజయ్య మాట్లాడుతూ గుంటూరు జోన్ విద్యార్థులు అత్యధికంగా బహుమతులు అందుకున్నారని వివరించారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు ల్యాప్‌టాప్స్ సాధించడంతో పాటు 26 మంది ట్యాబ్స్ పొందినట్లు తెలిపారు. అదే విధంగా 110 మంది విద్యార్థులు టాప్–5 ర్యాంకులతో పాటు 4,176 మంది విద్యార్థులు మెడల్స్ అందుకున్నట్లు వివరించారు. విద్యార్థులను ఏజీఎం అంజయ్యతో పాటు తెనాలి, పల్నాడు జోన్ ఆర్ఐలు అప్పాజీ, సురేంద్ర, అకడమిక్ కో–ఆర్డినేటర్లు పీవీడీ గోపీచంద్, కె.శ్రీనివాసరావు, బి.గోవర్ధన్, ప్రిన్సిపాల్స్, డీన్లు, ప్రైమరీ ఇన్‌చార్జులు అభినందించారు.

సిద్ధాంతాలు నచ్చి బీజేపీలో చేరాను

పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసి రామచంద్ర ప్రభు, పక్కన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం, బీజేపీ పార్టీ సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో చేరానని ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు చెప్పారు. శనివారం గుంటూరు విద్యానగర్‌లోని ఓ హోటల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో శుక్రవారం బీజేపీలో నూతనంగా చేరిన తులసి రామచంద్ర ప్రభు మాట్లాడారు. తనకు రాజకీయాలు తెలియవని, ఇప్పటివరకు ఒక నెల రోజులు మాత్రమే తాను రాజకీయాలలో ఉన్నానని వెల్లడించారు. తులసి సీడ్స్ అనే సంస్థను స్థాపించి వేలాదిమందికి ఉద్యోగ కల్పన చేశానన్నారు. పదవులు ఆశించి బీజేపీలోకి రాలేదని , ప్రజా సేవకోసమే రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ, తులసి యోగేష్ చంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఈ విధానంతో పండించిన ఆహార పదార్థాలను ఆహారంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి చింతా వరప్రసాద్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని రావిపాడు గ్రామంలో 2023–24 వార్షిక ప్రణాళికలో భాగంగా రైతులకు పలు కార్యక్రమాల గురించి వివరించారు. నవధాన్యాల సాగు వలన కలిగే లాభాల గురించి, భూమికి జరిగే ఉపయోగం గురించి, భూమిలో ఏర్పడే పోషకాలు, వాటి ఉపయోగాల గురించి రైతులకు వివరించారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పొన్నూరు(చేబ్రోలు): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని ఎస్‌పీపీ రోడ్డులోని ముబారక్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ముబారక్ నగర్ ఆర్చ్‌ను శనివారం ఎమ్మెల్యే కిలారి రోశయ్య ప్రారంభించారు.

గొప్ప దార్శనీకుడు లెనిన్

పాత గుంటూరు: మార్క్సిస్టు సిద్ధాంతాన్ని తొలిసారిగా సోవియట్ యూనియన్‌లో అమలు జరిపి ఆచరణలో పెట్టిన గొప్ప దార్శనీకుడు వి.ఐ.లెనిన్ అని, దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని సోవియట్‌లో అమలు జరిపిన ఘనత ఆయనకే దక్కుతుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం బ్రాడీపేట సీపీఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ 153వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక, నిత్యావసర సరుకుల ధరలు పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు మూర్తి, మోహన్‌రావు, శైలజ, మాధవరావు, శేషగిరి, సీపీఎం నాయకుడు వై.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీమా తీసుకుంటేనే రుణం

- రుణ మంజూరుకు బీమాను ముడిపెడుతున్న కొందరు బ్యాంకర్లు
- కట్టలేక ఇబ్బందులు పడుతున్న డ్వాక్రా మహిళలు



పొన్నూరు రోడ్డులోని ఇండియన్ బ్యాంక్

నెహ్రూనగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు, పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం(మెప్మా) డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలు మంజూరు చేస్తుంది. ఆ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకు దోహదపడుతుంటే కొంతమంది బ్యాంకర్లు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తూ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పొన్నూరు రోడ్డులోని ఇండియా బ్యాంక్ మైక్రోశాట్ (స్వయం సహాయక)లో అధిక సంఖ్యలో డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. ఇక్కడ లోన్ తీసుకోవాలంటే ఇన్సూరెన్స్ తప్పనిసరి కాకపోయినప్పటికీ ఇన్సూరెన్స్ తీసుకోవాల్సిందేనంటూ మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ప్రశ్నించడమే పాపమయింది..?!

ఆ బ్యాంకు పరిధిలో శివభవానీ గ్రూపు సభ్యులు గత కొద్ది సంవత్సరాలుగా రుణాలు తీసుకుంటున్నారు. గత నెలలో పాత లోన్ క్లియర్ అయిపోవడంతో మనిషికి రూ.2లక్షల చొప్పున కొత్త రుణం రూ.20లక్షలు మంజూరు అయింది. అయితే మంజూరు కావాలంటే తప్పనిసరిగా ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని బ్యాంక్ మేనేజర్, మెప్మా సిబ్బంది ఒత్తిడి తీసుకువచ్చారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇందులో ఒక మహిళ తనకు ఇదివరకే ఇన్సూరెన్స్ ఉందని, ఇప్పుడు అవసరం లేదని, అయినా ఇన్సూరెన్స్ తప్పనిసరి కాదుగదా అని బ్యాంక్ మేనేజర్‌ను ప్రశ్నించడంతో సదరు బ్యాంక్ మేనేజర్ ఇన్సూరెన్స్ పాలసీ కడితేనే రుణం మంజూరు అవుతుందని...లేనిపక్షంలో క్యాన్సిల్ చేస్తానని బెదిరింపులకు దిగారని గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ప్రశ్నించిన మహిళ చేత ఆర్థిక ఇబ్బందులు కారణంగా లోను కట్టలేకపోతున్నామని సెల్ఫ్ డిక్లరేషన్ రాయించుకుని మిగిలిన 9 మంది సభ్యులకు రూ.18లక్షలు మంజూరు చేశారు. దీనికితోడు ఆర్పీలు ఫోన్ చేసి, బ్యాంకు మేనేజర్ చెప్పినట్టు వినకపోతే గ్రూపు రద్దుచేస్తామని, ఇచ్చిన లోన్ వెనక్కి తీసుకుంటామని బెదిరింపులకు దిగుతున్నారని గ్రూపు సభ్యులు తెలిపారు. దీనిపై బ్యాంక్ మేనేజర్ నవతను విలేకరులు వివరణ కోరగా ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరి కాదని, అయితే గ్రూపు సభ్యుల్లో ఎవరైనా లోన్ కట్టని పక్షంలో వారు కట్టిన బీమా నుంచి నగదు నుంచి వసూలు చేస్తామని బదులిచ్చారు.

బెదిరింపులకు దిగుతున్నారు..



మేము కొద్ది సంవత్సరాలుగా డ్వాక్రా రుణాలు తీసుకుని తిరిగి సక్రమంగా చెలిస్తున్నాం. గత నెలలో పాత లోన్ క్లియర్ కావడంతో కొత్త లోన్ రూ.20లక్షలు మంజూరైంది. రూ.20లక్షలు లోను మంజూరు కావాలంటే తప్పనిసరిగా గ్రూపులోని ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని అంటున్నారు. వేరే గ్రూపులో కొంత మంది పాలసీ కట్టకపోయినా వారికి లోన్ మంజూరు చేశారు. మాకు మాత్రం ఇన్సూరెన్స్ కడితేనే లోన్ మంజూరు చేస్తామని చెబుతున్నారు. చేసేదేమిలేక 10 మంది గ్రూపు సభ్యుల్లో 9 మంది ఇన్సూరెన్స్ కట్టారు. మిగిలిన ఒక మహిళ ఇన్సూరెన్స్ కట్టని కారణంగా ఆమెకు లోన్ నిలిపివేశారు. ప్రశ్నించినందుకు గాను మీ గ్రూపు రద్దు చేస్తామని బెదిరింపులు దిగుతున్నారు. ఆమెతో వాళ్లకు కావాల్సినట్లు తీర్మానం రాసి, ఒత్తిడి చేసి సంతకం చేయించారు.

– జి.నాగలక్ష్మి, శివభవానీ గ్రూపు లీడర్

బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడతాం..

ఇన్సూరెన్స్ కడితేనే లోన్లు ఇస్తామన్న విషయంపై ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడాం. ఇండియన్ బ్యాంక్ రూల్స్ ప్రకారం ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని మేనేజర్ తెలిపారు. ఈ విషయంపై ఇండియన్ బ్యాంక్ ఉన్నతాధికారులతో మాట్లాడతాం.

– పి.వెంకటనారాయణ, మెప్మా పీడీ

క్లుప్తంగా

మహమూదియ మసీదు నూతన కమిటీ



పాత గుంటూరు: 17వ డివిజన్ ఇందిరా ప్రియదర్శిని కాలనీ మూడోలైనులోని మహమూదియ మసీదు, ఈద్గా నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ జబీ నియామకమైనట్లు కమిటీ గౌరవ సలహాదారులు షేక్ అల్లాబక్షు తెలిపారు. శనివారం రంజాన్ ప్రార్థనల అనంతరం మసీదులో మత పెద్దల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాబక్షు మాట్లాడుతూ స్థానిక ముస్లింల ఆకాంక్ష మేరకు మసీదు, ఈద్గా అభివృద్ధికి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యదర్శిగా షేక్ చాన్ బాషా, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ జకర్రియ్య, సంయుక్త కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రజాక్, కోశాధికారి షేక్ వాజిద్, మరో 12 మంది కార్యవర్గ సభ్యులతో కమిటీ ఏర్పడిందని అన్నారు. అనంతరం జబీ మాట్లాడుతూ మసీదు, ఈద్గా, మదరసాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం రూ. 2.50లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సభ్యులు షేక్. కరిముల్లా, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రీ పరిరక్షణ బాధ్యత అందరిదీ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ కన్నతల్లి వంటి భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. అనంతరం 300 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితా దేవి, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళి, సీపీటీ క్యాంపస్ ఇంచార్జ్ జి.సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఎన్‌సీసీ అధికారి పి.కుమార్ రాజా, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన షేక్ సుభాని శనివారం ఇన్నర్ రింగ్‌రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళుతూ విజయ డిజిటల్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో సుభాని తీవ్రగాయాలపాలవ్వటంతో స్థానికులు అతనిని 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు సుభాని పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. సంఘటనపై యువకుడి తండ్రి ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్య సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరండల్‌పేట 12/2 లో రామయోగిరెడ్డి అతని భార్య సంధ్యారాణి (22) నివసిస్తున్నారు. వీరికి 5 సంవత్సరాల క్రితం వివాహమైంది. రామయోగిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగి. దంపతులకు ఇద్దరు పిల్లలు. శుక్రవారం రాత్రి సంధ్యారాణి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సంధ్యారాణి తండ్రి నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన ఘటనపై కేసు

ప్రత్తిపాడు: ప్రయాణికులతో వెళుతున్న ఆటోను గుర్తుతెలియని కోళ్ల బండి ఢీకొట్టిన ఘటనపై ప్రత్తిపాడు పోలిస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం మేడావారిపాలెం గ్రామానికి చెందిన కారుమూరి వీరయ్య ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 20వ తేదీన ప్రత్తిపాడు నుంచి మేడావారిపాలెం గ్రామానికి ఆటోలో ఐదుగురు ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నాడు. ప్రత్తిపాడు గ్రామశివారులో నూతనంగా నిర్మిస్తున్న కోల్డ్ స్టోరేజీ సమీపంలో గుర్తుతెలియని కోళ్ల ఫారానికి చెందిన బండి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు ఆటోడ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.